సాక్షి యాదాద్రి భువనగిరి

శనివారం । 21 । జనవరి । 2023



రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలి
ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం ఆందోళన చేపట్టింది. - 9లో



సాయిధామంలో విచారణ
హైకోర్టు ఉత్తర్వుల మేరకు పెద్ద పర్వతాపూర్ సాయిధామం ఆశ్రమంలో అధికారులు శుక్రవారం విచారణ జరిపారు. - 10లో

గరిష్టం/కనిష్టం 29°/17°

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సీఎస్‌ను కలిసిన గొంగిడి సునీత



సీఎస్ శాంతికుమారికి యాదాద్రి లడ్డూ అందజేస్తున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

యాదగిరిగుట్ట : రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నూతనంగా నియామకమైన శాంతికుమారిని శుక్రవారం ఆమె చాంబర్‌లో ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మర్యాదపూర్వకంగా కలిశారు. యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి లడ్డూ ప్రసాదం అందజేశారు. స్వామివారి కండువా కప్పి సన్మానించారు. అదే విధంగా రాచకొండకు సీపీ దేవేంద్రసింగ్ చౌహాన్‌ను ఆయన కార్యాలయంలో కలిశారు.

పల్లె ప్రగతి పనులు భేష్



రికార్డు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ

సంస్థాన్ నారాయణపురం : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయాన్ని శుక్రవారం జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి సందర్శించారు. వివిధ రికార్డులను పరిశీలించారు. అనంతరం కొత్తగూడెంలో పర్యటించారు. గ్రామంలో చేపట్టిన పల్లె ప్రగతి పనులను పరిశీలించి బాగున్నాయంటూ కితాబునిచ్చారు. గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్లి రికార్డులు చూశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి చిన్నారులతో ముచ్చటించారు. పౌష్టికాహారం పంపిణీ, కేంద్రానికి వస్తున్న లబ్ధిదారుల సంఖ్య, రికార్డుల నిర్వహణ తదితర అంశాలప ఆరా తీశారు. ఆయన వెంట ఎంపీడీఓ రాములు, ఎంపీఓ నర్సింహారావు, సుధాకర్, సర్పంచ్ దోనూరి సుశీల, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అక్రమ నియామకాలను రద్దు చేయాలని వినతి



సీడీఎంఏను కలిసిన కౌన్సిలర్లు

భువనగిరిటౌన్ : మున్సిపాలిటీలోని శానిటేషన్ విభాగంలో చేపట్టిన సిబ్బంది నియామకాల్లో అవకతవకలు చోటు చేసుకున్నాయని, వెంటనే విచారణ చేయాలని కోరుతూ కౌన్సిలర్లు శుక్రవారం సీడీఎంఏకు వినతిపత్రం అందజేశారు. అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో 28 పోస్టులకు గాను 189 మందిని దరఖాస్తు చేసుకున్నారని, రాయగిరిలో ఒకే కుటుంబం నుంచి ఏడుగురిని నియామకం చేసినట్లు పేర్కొన్నారు. నియామకాలను రద్దు చేయాలని కోరుతూ దరఖాస్తుదారులంతా మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేసిన అధికారులు పట్టించుకోలేదన్నారు. నియామకాలను రద్దు చేసి అర్హతను బట్టి పారదర్శకంగా మళ్లీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పోత్నక్ ప్రమోద్‌కుమార్, ఈరపాక నర్సింహ, పడిగెల రేణుకప్రదీప్ ఉన్నారు.

సోషల్ మీడియాను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న గోద శ్రీరాములు

మోటకొండూరు : మారుతున్న కాలానికి అనుగుణంగా సోషల్ మీడియాను సద్వినియోగం చేసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పార్టీ శ్రేణులకు సూచించారు. మోటకొండూరులోని మహాలక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం పార్టీ కార్యకర్తలకు ఏర్పాటు చేసిన సోషల్ మీడియా శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో మతోన్మాద శక్తులు సోషల్ మీడియా ద్వారా మత విద్వేషాలను రెచ్చగొడుతున్నాయని ఆరోపించారు. ఆయా పార్టీల తప్పులను ఎత్తి చూపుతూ ప్రజలను చైతన్యం చేయాలని కోరారు. ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి సోషల్ మీడియా ద్వారా సైతం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గాదెగాని మాణిక్యం, ఉప్పల ముత్యాలు, చెక్క వెంకటేష్, కళ్లెం కృష్ణ, హరిశంద్ర తదితరులు పాల్గొన్నారు.

పరిహారం ఇంకెప్పుడు?

- నాలుగేళ్లవుతున్నా ప్రభుత్వానికి కనికరం లేదు
- పైసలిస్తే మా బతుకులు మేం బతుకుతాం
- విడతల వారీగా కాకుండా ఒకేసారి పరిహారం చెల్లించాలి
- బీఎన్ తిమ్మాపూర్ గ్రామస్తుల డిమాండ్
- భువనగిరి ఆర్డీఓ కార్యాలయం నుంచి కలెక్టరేట్‌కు పాదయాత్ర
- మహాధర్నా, వంటావార్పుతో నిరసన



కలెక్టరేట్‌కు పాదయాత్రగా వెళ్తున్న బీఎన్ తిమ్మాపూర్ గ్రామస్తులు, రాజకీయ పార్టీల నాయకులు

సాక్షి, యాదాద్రి : బస్వాపురం రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న బీఎన్ తిమ్మాపురం గ్రామస్తులు పరిహారం కోసం 54 రోజులుగా దీక్ష చేస్తున్నా ప్రభుత్వం నుంచి హామీ లభించడం లేదు. దీక్షలో భాగంగా ఇప్పటికే వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టిన నిర్వాసితులు.. శుక్రవారం భువనగిరి ఆర్డీఓ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు పెద్ద ఎత్తున పాదయాత్ర నిర్వహించారు. అక్కడ మహాధర్నా, వంటావార్పు చేపట్టి నిరసన తెలిపారు. 2019 ఫిబ్రవరిలో భూసేకరణ నోటిఫికేషన్ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పటి వరకు ముంపు బాధితులకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించలేదు. దీంతోపాటు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ డబ్బులు సైతం ఇవ్వకపోవడంతో నిర్వాసితులు ఆగ్రహంతో ఉన్నారు. రిజర్వాయర్‌లో సర్వస్వం కోల్పోతున్న తమకు పరిహారం విడతల వారీగా కాకుండా ఒకేసారి చెల్లిస్తే ఎక్కడైనా వెళ్లి జీవిస్తామంటున్నారు. రిజర్వాయర్ నిర్మాణం తుది దశ పూర్తి కావొచ్చినా పరిహారం చెల్లించకుండా ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుందని ఆక్రోశాన్ని వెల్లగక్కుతున్నారు.

1,724 ఎకరాలకు నోటిఫికేషన్

రిజర్వాయర్ కోసం బీఎన్ తిమ్మాపూర్ పరిధిలో 1,724 ఎకరాలు సేకరించాలని నాలుగేళ్ల క్రితం ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో 700 ఎకరాలు ప్రభుత్వ భూమి కాగా, 400 ఎకరాలు పరస్పర అంగీకారం ద్వారా అధికారులు సేకరించారు. ఇందుకోసం పరిహారం కింద రైతులకు రూ.107 కోట్లు చెల్లించారు. 1,022 ఎకరాల సేకరణకు జనరల్ అవార్డు ప్రకటించారు.ఇందుకోసం రూ.198 కోట్లు అవసరం కాగా చెల్లించకుండా జాప్యం చేస్తున్నారు. తొలి విడతలో చెల్లించిన డబ్బులతో కొందరు భూములు కొనుగోలు చేయగా మరికొందరు వ్యాపారం తదితర అవసరాలకు వాడుకున్నారు.

> అప్పుడిన్ని ఇప్పుడిన్ని పైసలిస్తే అక్కరకు రాకుండా పోతున్నయి.. ఇప్పటికే ఇచ్చిన డబ్బులో సగం ఖర్చు కావడంతో గుడెసె కూడా వేసుకోలేని పరిస్థితి ఏర్పడింది.. ప్రభుత్వం మాకు ఇస్తామన్న భూ పరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఒకేసారి చెల్లించాలి. ఆ డబ్బుతో కనీసం రేకుల ఇల్లయినా కట్టుకుంటం.
>
> ఇదీ.. బీఎన్ తిమ్మాపురం గ్రామస్తుల ఆవేదన

ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అంతంతే..

ముంపు గ్రామం కోసం భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ వద్ద లే అవుట్ చేస్తున్నారు. సుమారు 1,056 మంది అర్హులను గుర్తించి వారికి స్థలాలు ఇవ్వడంతో పాటు ఇళ్లు నిర్మించుకోవడానికి, మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయాల్సి ఉంది. ఇళ్లు కోల్పోయిన 650 మందికి రూ.50 కోట్లు చెల్లించారు. ఇంకా 406 మందికి రూ.30 కోట్లు రావాలి. అయితే ఇంటి నిర్మాణానికి రూ.7.61 లక్షల చొప్పున ప్యాకేజీ ఇవ్వగా అది కాస్త ఖర్చయిపోయింది. లేఅవుట్ పూర్తి కాకపోవడంతో ఇల్లు నిర్మించుకోలేకపోయామని, చేతిలో ఉన్న డబ్బంతా ఖర్చయినట్లు నిర్వాసితులు వాపోతున్నారు. లేఅవుట్ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన కోసం కాంట్రాక్టర్‌కు రూ.45 కోట్లు చెల్లించాల్సి ఉంది. దీంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి.

భర్త, కొడుకును కోల్పోయిన



“ బస్వాపురం రిజ్వాయర్‌లో మా ఊరు మునిగిపోతుందన్న నా భర్త, కుమారుడు రోజూ ఫికర్ పడేవారు. అదే బెంగతో మూడు నెలల వ్యవధిలో ఇద్దరూ చనిపోయారు. వారిని కోల్పోయి మూడేళ్లవుతోంది. మరో కుమారుడు అనారోగ్యంతో ఉన్నాడు. ప్రభుత్వం రిజర్వాయర్ పేరుతో భూములు తీసుకుని ఇప్పటి వరకు పరిహారం పైసలిస్తలేదు.

–బండారు పెంటమ్మ, బీఎన్ తిమ్మాపురం

ఇంకెంతకాలం ఎదురుచూడాలి



“ మా గ్రామంలో అన్ని కుటుంబాలు సర్వస్వం కోల్పోతున్నాయి. వారందరికీ నష్ట పరిహారం చెల్లించాలి. మరొక చోట తిమ్మాపురం గ్రామాన్ని నిర్మించి ఇవ్వాలి. పరిహారం డబ్బుల కోసం నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్నాం. ఇంకెంతకాలం ఆపుతరు. కారణాలు చెప్పి పరిహారం చెల్లించకుడా జాప్యం చేస్తుంద్రు. మా బాధలు అర్థం చేసుకొని త్వరగా పైసలియ్యాలే.

–లావణ్య, బీఎన్ తిమ్మాపురం

ప్రభుత్వానికి నివేదిక పంపాం



“ బీఎన్ తిమ్మాపూర్ ముంపు బాధితులకు పరిహారం చెల్లించడానికి అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి నివేదిక పంపించాం. ఆర్అండ్ ప్యాకేజీలో ఇప్పటికే రూ.50 కోట్లు చెల్లించాం. మిగిలిన వారికి రూ.30 కోట్లు ఇవ్వాలి. వాటిని కూడా త్వరలోనే చెల్లిస్తాం. పునరావాస గ్రామం కోసం లే అవుట్‌ను అభివృద్ధి చేస్తున్నాం. ఇళ్ల స్థలాలను త్వరలోనే కేటాయిస్తాం.

– పమేలా సత్పతి, కలెక్టర్

హద్దులు చెరిపి.. కబ్జా చేసి!

ప్రభుత్వ భూమికి ఎసరుపెట్టిన రియల్టర్లు

- 3నుంచి 4 ఎకరాలు ఆక్రమణ
- వెంచర్లలో కలుపుకున్నా పట్టించుకోని అధికారులు
- గుండాల నడిబొడ్డున వెలుగులోకి



ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఏర్పాటు చేసిన వెంచర్

గుండాల : మండల కేంద్రంలోని ప్రభుత్వ స్థలాన్ని హద్దులు చెరిపి కొందరు కబ్జా చేశారు. కోట్లాది రూపాయల విలువ చేసే భూమి ఆక్రమణకు గురైనా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. ఆక్రమణకు గురైన భూమి తహసీల్దార్ కార్యాలయం పక్కనే ఉండడం విశేషం.

గుండాలలో తహసీల్దార్ కార్యాలయం చుట్టూ 906 సర్వే నంబర్‌లో 126.26 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అందులో గుట్టతో పాటు సాగుకు అనువైన భూమి ఉంది. ఇటీవల కాలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు గుట్ట పరిసరాల్లో ఉన్న తమ సొంత భూమిలో వెంచర్లు చేశారు. వీరి కన్ను పక్కనే ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములపై పడింది. 3 నుంచి 4 ఎకరాల భూమి తమ సొంత కలుపుకొని వెంచర్లు చేసినట్లు తెలుస్తోంది. ప్లాట్లు చేసి విక్రయిస్తున్నా అధికారులు నోరు మెదపడం లేదన్న విమర్శలున్నాయి. భూమిని కబ్జా చేసిన రియల్టర్లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రభుత్వ భూమిలో చేపట్టిన ఉపాధి పనుల వివరాల బోర్డును తొలగించిన రియల్టర్లు

సర్వే చేయిస్తాం

గుండాల మండల కేంద్రంలోని 906 సర్వే నంబర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిని సర్వే చేయిస్తాం. కబ్జా చేసినట్లు తేలితే సదరు వ్యక్తులపై చర్యలు తీసుకుంటాం.

–జ్యోతి, తహసీల్దార్, గుండాల మండలం

మార్చిలోగా ఆధార్ అనుసంధానం పూర్తి

- కలెక్టర్ పమేలా సత్పతి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీఓ

భువనగిరిటౌన్ : ఓటరు గుర్తింపు కార్డులకు ఆధార్ అనుసంధాన ప్రక్రియ మార్చిలోగా పూర్తి చేయనున్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ శుక్రవారం జిల్లా కలెక్టర్లతో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాతీయ ఓటరు దినోత్సవం, ఫొటో సిమిలరీ ఎంట్రీలు, ఓటరు ఎపిక్ కార్డుల జారీ, ఆధార్ అనుసంధానంపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 14,750 ఎపిక్ కార్డులను పోస్టాఫీసుల ద్వారా డిస్ట్రిబ్యూషన్ చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఫొటో సిమిలర్ (ఒకే ఫొటోతో పలు ఓటరు ఐడీలు) ఎంట్రీలకు సంబంధించి 14,259 గుర్తించామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీఓ ఎంవీ భూపాల్‌రెడ్డి, డీఆర్‌డీఓ ఉపేందర్‌రెడ్డి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ గిరిధర్, డిప్యూటీ తహసీల్దార్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సర్వే త్వరగా పూర్తి చేయండి

భువనగిరి టౌన్ : భువనగిరి, బీబీనగర్, బొమ్మలరామారం, చౌటుప్పల్, భూదాన్‌పోచంపల్లి మండలాల పరిధిలో ఉన్న చెరువులను త్వరగా సర్వే చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్ తివారీ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో తహసీల్దార్లతో సమావేశమై చెరువుల సర్వేపై సమీక్షించారు. నిర్లక్ష్యం వహించకుండా సకాలంలో సర్వే పూర్తి చేయాలని కోరారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ సూపరింటెండెంట్ నాగలక్ష్మి, తహసీల్దార్ వెంకటరెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, అశోక్ రెడ్డి, చారి, మమత, నీటి పారుదల శాఖ ఏఈలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌కు అనుమతి ఇవ్వొద్దు

- సర్వే బృందాన్ని అడ్డుకున్న సదర్శాపురం గ్రామస్తులు, రైతులు



అధికారుల వాహనాన్ని అడ్డుకున్న రైతులు

మోత్కూరు : మండలంలోని సదర్శాపురం బిక్కేరు వాగులో ఇసుక రీచ్‌కు అనుమతి ఇవ్వద్దని తెలంగాణ స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, న్యాయవాది పర్రెపాటి యుగేందర్ ఆధ్వర్యంలో రైతులు, గ్రామస్తులు ఆందోళనకు దిగారు. బిక్కేరు వాగులో ఇసుక తీయడానికి శుక్రవారం సర్వే చేయడానికి వచ్చిన మైనింగ్, రెవెన్యూ అధికారులను గ్రామ శివారులో అడ్డుకొని నిరసన తెలిపారు. వాగులో ఓ పక్క రూ.4 కోట్ల వ్యయంతో చెక్ డ్యాం నిర్మిస్తూనే మరో పక్క ఇసుక రీచ్‌కు అనుమతించడ వల్ల తీరని నష్టం జరుగుతుందన్నారు. ప్రాజెక్టుల పేరుతో అనుమతి పొందిన కాంట్రాక్టర్లు.. అధికార పార్టీ నాయకులు, అధికారులతో కుమ్మక్కై నిత్యం వందలాది లారీల్లో అక్రమంగా ఇసుక తరలించే అవకాశం ఉంటుందన్నారు. వాగులో బోర్లు వేసుకొని కిలో మీటర్ల మేర లక్షలాది రూపాయలు ఖర్చు చేసి పైపులైన్ ఏర్పాటు చేసుకున్న రైతులు తీవ్రంగా నష్టపోతారని పేర్కొన్నారు. తమ పొట్ట కొట్టొద్దని రైతులు వాపోయారు.దీంతో అధికారులు సర్వే చేయకుండా వెనుదిరిగి వెళ్లారు. ఈ కార్యక్రమంలో రైతులు చిలుకల నర్సయ్య, దొండ సోమయ్య, యాదయ్య, శ్రీశైలం, పరమేష్, బుజ్జిలింగం, సోమన్న, కోటి, కరుణాకర్, నవీన్, వెంకన్న, నర్సయ్య, శ్రీను, సతీష్, సాయి, అయోధ్య, గణేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు 3,864 మందికి..

భువనగిరి : కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా రెండో రోజు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా 3,864 మందికి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 34 కేంద్రాల్లో కంటి పరీక్షలు చేశారు. 2,328 మందికి రీడింగ్ అద్దాలు అందజేశారు.1,654 మందికి వివిధ పవర్ కలిగిన ప్రిస్కిప్షన్ అద్దాలు ఆర్డర్ చేశారు. వీటిని 15 రోజుల్లో వారికి అందజేస్తామని డీఎంహెచ్ఓ డాక్టర్ మల్లికార్జున్‌రావు తెలిపారు. ఆయన జిల్లాలో పలు చోట్ల శిబిరాలను సందర్శించి నేత్ర పరీక్షలను పరిశీలించారు.



భువనగిరి: కంటి పరీక్షలను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ

యాదాద్రిలో ఊంజలి సేవ

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో శుక్రవారం ఆండాళ్ అమ్మవారికి ఊంజలి సేవ కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని అలంకరించి సేవను ఆలయ మాఢ, తిరువీధిలో ఊరేగించారు. అనంతరం అద్దాల మండపంలో అధిష్టింపజేసి ఊంజలి సేవ చేపట్టారు. ఇక ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రధానాలయంలో విశేష పూజలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాతం,అనంతరం అర్చన, అభిషేకం చేశారు. ఇక ముఖ మండపంలో సుదర్శన హోమం నిత్యకల్యాణం తదితర పూజలు గావించారు.



ఆలయ తిరువీధిలో ఆండాళ్ అమ్మవారి సేవను ఊరేగిస్తున్న ఆచార్యులు

చిన్న గడీల్లా క్యాంప్ కార్యాలయాలు



మాట్లాడుతున్న బూర నర్సయ్యగౌడ్, చిత్రంలో హరిశంకర్‌గౌడ్, వట్టిపల్లి శ్రీనివాస్ తదితరులు

- మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ ఎద్దేవా

యాదగిరిగుట్ట : ప్రగతి భవన్ పెద్ద గడి అయితే.. నియోజకవర్గ కేంద్రాల్లోని ఎమ్మెల్యేల క్యాంప్ కార్యాలయాలు చిన్న గడీల్లా మారాయని భువనగిరి మాజీ ఎంపీ, బీజేపీ రాష్ట్ర నాయకుడు బూర నర్సయ్యగౌడ్ ఎద్దేవా చేశారు. యాదగిరిగుట్టలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ ముఖ్యమంత్రి చేయనన్ని అప్పులు కేసీఆర్ చేశారని ఆరోపించారు. మిగులు బడ్జెట్‌లో ఉన్న రాష్ట్రాన్ని రూ.4.36 లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టాడని దుయ్యబట్టారు. యాదాద్రి ఆలయాన్ని అద్భుతంగా నిర్మాణం చేశామని గొప్పలు చెబుతున్న సీఎం.. వ్యాపారులు, ఆటో డ్రైవర్లను అకారణంగా ఎందుకు రోడ్డున పడేశారని ప్రశ్నించారు. ఆలయానికి రోజుకు రూ.1 కోటి ఆదాయం వస్తుందని సాక్షాత్తు మంత్రి కేటీఆర్ చెప్పారని, అలాంటప్పుడు ఆటో డ్రైవర్లకు రూ.10 కోట్లు సబ్సిడీ ఇవ్వలేరా అని ప్రశ్నించారు. సబ్సిడీ ఇస్తే ప్రభుత్వం సూచించిన డిజైన్ ప్రకారం ఆటోలు, హోమినీ వ్యాన్లు కొనుగోలు చేసుకొని యాదాద్రి కొండపైకి నడిపించుకుంటూ ఉపాధి పొందుతారని పేర్కొన్నారు. ఎంఎంటీఎస్‌ను యాదాద్రి పుణ్యక్షేత్రం వరకు తీసుకురావాలని గతంలోనే కేంద్ర రైల్వే శాఖ మంత్రి, రైల్వే బోర్డు చైర్మన్‌ను కలిశానని, కేసీఆర్ పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం ప్రాజెక్టుకు అతీగతి లేకుండాపోయిందన్నారు. కాళేశ్వరం అనేది ప్రాజెక్టు కాదని, ఒక చెక్‌డ్యాం అని ఎద్దేవా చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కదోవ పట్టించడానికి కేసీఆర్ బీఆర్ఎస్ తీసుకువచ్చారని విమర్శించారు. ఖమ్మం సభలో కేసీఆర్ ఇచ్చిన స్పీచ్‌లో ఏమాత్రం పస లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆడుతున్న డ్రామాలను ప్రజలు గమనించాలని, ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇస్తే అభివృద్ధి ఎలా ఉంటుందో చేసి చూపిస్తామన్నారు. ఈ సమావేశంలో బీజేపీ ఆలేరు నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు సూదగాని హరిశంకర్‌గౌడ్, పడాల శ్రీనివాస్, వట్టిపల్లి శ్రీనివాస్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు భువనగిరి శ్యాంసుందర్, మండల అధ్యక్షుడు కళ్లెం శ్రీనివాస్ గౌడ్, నాయకులు రచ్చ శ్రీనివాస్, బొమ్మగాని రాజమణి తదితరులు పాల్గొన్నారు.

భవంతుల్లో భద్రత డొల్ల!

- కనిపించని అగ్నిమాపక పరికరాలు
- సెల్లార్లలో వ్యాపారాలు
- ఇరుకు ప్రదేశాల్లో నిర్మాణం
- అగ్నిప్రమాదాలు సంభవిస్తే ఆగమే
- సికింద్రాబాద్ ఘటనతో చర్చనీయాంశం



భువనగిరిలో ఓ భవనం సెల్లార్‌లో ఏర్పాటు చేసిన బేకరీ

భువనగిరి : జిల్లాలో వెలుస్తున భారీ భవంతులు, అపార్ట్‌మెంట్లలో భద్రతాపరమైన చర్యలు కొరవడుతున్నాయి నిబంధనల ప్రకారం సెట్‌బ్యాక్‌లు ఉండడం లేదు. అగ్నిమాపక పరికరాలు మచ్చుకైనా కనిపించడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్లలో వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. దీంతో ఏదైనా అగ్నిప్రమాదం జరిగినప్పుడు పెద్ద ఎత్తున ఆస్తి, ప్రాణనష్టం వాటిల్లే అవకాశం లేకపోలేదు. భారీ భవంతులు, ముఖ్యంగా వ్యాపార, వాణిజ్య నిర్మాణాల్లో అధికారులు అగ్నిమాపక ఏర్పాట్లు పరిశీలించాలన్న నిబంధనలు ఉన్నా పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.సికింద్రాబాద్‌లోని దక్కన్ మాల్‌లో జరిగిన అగ్నిప్రమాద ఘటన నేపథ్యంలో జిల్లాలోని మాల్స్, భవనాలు, అపార్టుమెంట్లలో భద్రత చర్చనీయాంశంగా మారింది.

జీ ప్లస్ 4 వరకే అనుమతి

భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో జీ ప్లస్ 4 వరకే భవన నిర్మాణాలకు అనుమతి ఉంది. చాలామంది జీ ప్లస్ 2 లేదా 3 వరకు అనుమతి తీసుకుని జీ ప్లస్ 4 లేదా పెంట హౌస్ పేరుతో 5వ అంతస్తు వరకు నిర్మించుకుంటున్నారు. ఇలాంటి వాటిలో గృహాలతో పాటు ఆస్పత్రులు, పాఠశాలలు, కళాశాలలు నిర్వహిస్తున్నారు. అలాగే పట్టణంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ఇళ్లను వ్యాపార సముదాయాలుగా మార్చుకున్నారు. ఆయా భవనాల్లో అగ్నిమాపక నివారణ యంత్రాలు ఏర్పాటు చేసుకోవడం లేదు. సెల్లార్లను పార్కింగ్ కోసం వినియోగించాలన్న నిబంధనగా ఉండగా వ్యాపారాలు, దుకాణాల కోసం వాడుకుంటున్నారు. ప్రస్తుతం నిర్మిస్తున్న భారీ అపార్ట్‌మెంట్ల వద్ద కనీసం సెట్ బ్యాక్ తీసుకోకపోవడంతో పాటు ఇరుకుగా ఉన్న ప్రదేశాల్లో నిర్మాణం చేపడుతున్నారు.

అనుమతులు తప్పనిసరి

“ భవన నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా ఉంటే చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే పట్టణంలో ప్రత్యేక టీం ద్వారా అనుమతులకు మించి చేపట్టిన నిర్మాణాలను గుర్తించే పనిలో ఉన్నాం. అన్ని రకాల అనుమతులు ఉండాలి. సెల్లార్‌లో పార్కింగ్ తప్ప వ్యాపారాలు నిర్వహించవద్దు.

–నాగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, భువనగిరి

విరుద్ధంగా నిర్మించినవే అధికం

చౌటుప్పల్ : మున్సిపాలిటీ పరిధిలో అన్ని రకాలుగా సంబంధించిన భవనాలు 8 వేల వరకు ఉన్నాయి. వాటిలో వాణిజ్యానికి సంబంధించినవి 1200 ఉంటాయి. వీటిలో అత్యధికంగా నిబంధనలు ఉల్లంఘించినవే కన్పిస్తాయి. కొన్ని భవనాలను అనుమతి లేకుండానే నిర్మించగా, మరికొన్నింటిని అనుమతులకంటే రెండు మూడు అంతస్తులు అధికంగా నిర్మించినవి ఉన్నాయి. బహుళ అంతస్తులు, వాణిజ్య భవనాలకు ఎక్కడా ఫైర్ అనుమతులు తీసుకున్న దాఖలాలు లేవు. అనుకోని ఘటన ఏదైనా జరిగితే సహాయక చర్యలు చేపట్టలేని విధంగా ఇరుకు ప్రాంతాల్లోనూ నిర్మించారు. తనిఖీలు నిర్వహించాల్సిన అధికారులు.. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా పట్టించుకోవడం లేదు.



చౌటుప్పల్‌లో నిబంధనలు పాటించకుండా నిర్మిస్తున్న భవనం

క్లుప్తంగా

రైలు నుంచి పడి వ్యక్తి మృతి

భువనగిరి : రైలు నుంచి కిందపడి ఓ వ్యక్తి మృతిచెందాడు. యాదాద్రి భువనగిరి జిల్లాలో చోటు చేసుకున్న ఈ ఘటనపై రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నిజామాబాద్‌కు చెందిన కలకోటి అభిలాష్(32) శుక్రవారం సికింద్రాబాద్ నుంచి వరంగల్‌కు వెళ్తున్న సింహపురి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. ఉదయం భువనగిరి మండలం పగిడిపల్లి–భువనగిరి రైల్వేస్టేషన్ల మధ్య ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి కింద పడడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఇన్‌చార్జ్ కోటేశ్వర్‌రావు తెలిపారు.

వాహనం బోల్తా



భూదాన్‌పోచంపల్లి : మండలంలోని జలాల్‌పురం శివారులోని అర్బన్ పార్కు సమీపంలో శుక్రవారం సాయంత్రం కర్బూజ పండ్లలోడుతో వేగంగా వస్తున్న టాటాఏస్ వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. భూదాన్‌పోచంపల్లి మండలంలోని జూలూరు గ్రామానికి చెందిన కేతం నాగరాజు మండల శివారులోని కొత్తగూడెం పండ్ల మార్కెట్ నుంచి టాటాఏస్ వాహనంలో కర్బూజ పండ్లను తీసుకొని గ్రామానికి వస్తున్న క్రమంలో అర్బర్ పార్కు సమీపంలో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు ప్రాణాపాయం తప్పింది.

తాటికల్‌లో వృద్ధుడి దారుణ హత్య

- గొంతు నులిమి చెరువులో పడేసిన బావమరిది, అతడి ఇద్దరు కుమారులు
- భూ వివాదాలతోనే ఘాతుకం
- పోలీసుల అదుపులో ఒకరు.. పరారీలో ఇద్దరు



కన్నీరుమున్నీరవుతున్న హతుడి భార్య, కుటుంబ సభ్యులు



ఘటన స్థలం వద్ద విచారణ జరుపుతున్న సీఐ వెంకటయ్య తదితరులు

నకిరేకల్ : భూ తగాదాల నేపథ్యంలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం తాటికల్‌లో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకున్న ఈ ఘటనపై పోలీసులు, హతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శాలిగౌరారం మండలం వంగమర్తి గ్రామానికి చెందిన ఆకిటి వెంకటయ్య (62) చిన్నతనంలో తాటికల్ గ్రామానికి వచ్చి స్థిరపడిపోయాడు. ఈ గ్రామ వాసినే వివాహం చేసుకుని వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు కాగా, అందరికీ వివాహాలు జరిపించాడు.

ఏళ్లుగా బావమరిదితో భూ వివాదం

వెంకటయ్య సొంత బావమరిది అయిన ఇదే గ్రామ వాసి వనం సైదులుతో కలిసి కొన్నేళ్ల క్రితం తాటికల్ శివారులోని గుట్ట వద్ద కొంత భూమిని కొనుగోలు చేశాడు. అయితే, ఈ భూమి విషయంలో రెండు కుటుంబాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఇదే క్రమంలో 2013లో వనం సైదులు తన బావ వెంకటయ్యపై దాడి కూడా చేశాడు. అప్పట్లో పోలీస్ స్టేషన్‌లో కేసులు కూడా నమోదయ్యాయి. పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీలు జరిగినా రెండు కుటుంబాల మధ్య సయోధ్య కుదరకపోవడంతో ఒకరిపై ఒకరు కత్తులు దూసుకుంటున్నారు.

ఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు

చెరువులో అనుమానాస్పదంగా వ్యక్తి మృతిచెందాడన్న సమాచారం అందుకున్న సీఐ వెంకటయ్య సిబ్బందితో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించారు. స్థానికుల సహాయంతో మృతదేహాన్ని వెలికి తీయించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తన తండ్రిది అనుమానాస్పద మృతి కాదని వనం సైదులు, అతడి ఇద్దరు కుమారులు నాగరాజు, గోపి చెరువు వద్ద కాపుకాసి హత్య చేశారని హతుడి కుమారుడు ఆకిటి సైదులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంకటయ్య హత్యకు రెండు కుటుంబాల మధ్య పాత కక్షలు, భూ తగాదాలు, మరేమైనా కారణాలు ఉన్నాయా అన్న కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. హతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు వనం సైదులు, అతడి ఇద్దరు కుమారులపై హత్యా నేరం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు. కాగా, ఈ కేసులో సైదులు పెద్ద కుమారుడిని పోలీసులు అదుపులోకి తీసుకోగా సైదులు, అతడి చిన్న కుమారుడు పరారీలో ఉన్నట్లు తెలిసింది.



వెంకటయ్య మృతదేహం

గ్రామంలో ఉద్రిక్తత

సమీప బంధువులే ఆకిటి వెంకటయ్య (52)ను హత్య చేసినట్టు వార్త దహనంలా వ్యాపించడంతో తాటికల్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తాటికల్ గ్రామంలో వారం రోజుల క్రితం భూ తగాదాల నేపథ్యంలో ఓ వర్గం వారు మరో వర్గం వారి ఇంటిపై గొడ్డళ్లు ,కత్తులతో దాడి చేసి బీభత్సం చేసి మహిళను బెదిరించిన విషయం తెలసిందే. తాజాగా ఇదే గ్రామంలో ఇరు కుటుంబాల మధ్య జరుగుతున్న గొడవల్లో ఒకరి హత్య జరగడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

చెరువు వద్ద మాటేసి..

భూ వివాదం నేపథ్యంలో సైదులు బావ వెంకటయ్యపై కోపం పెంచుకుని హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. అందుకు అదును కోసం వేచి చూస్తున్నాడు. అయితే ఆకిటి వెంకటయ్య రోజు మాదిరిగా శుక్రవారం తెల్లవారుజామున 5:30 గంటల సమయంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఇంటి సమీపంలోని ముత్యాలమ్మ చెరువు వద్దకు వెళ్లాడు. అక్కడే తన ఇద్దరు కుమారులు నాగరాజు, గోపితో మాటేసి ఉన్న సైదులు ఒక్కసారిగా వెంకటయ్యపై దాడి చేశారు. ముగ్గురు కలిసి వెంకటయ్య గొంతు పిసికి ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని చెరువులో పడేసి ప్రమాదవశాత్తు అందులో పడి మృతిచెందినట్టు చిత్రీకరించి అక్కడి నుంచి పరారయ్యారు. కొద్ది సేపటి తర్వాత అటువైపుగా వెళ్లిన గ్రామస్తులు చెరువులో వెంకటయ్య మృతదేహం తేలియాడుతూ ఉండడాన్ని గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటన స్థలానికి చేరుకుని బోరున విలపించారు.

క్రికెట్ ఆడుదాం.. ప్రతిభను చాటుదాం

ఈ నెల 22 సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ఎంట్రీలకు చివరి తేదీ

SAKSHI / SAKSHI DIGITAL MEDIA GROUP — SPL SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

Regional sponsor

SUDHAKAR PIPES AND FITTINGS — LEADER IN QUALITY AND TECHNOLOGY

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపాదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్–19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్–25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్టంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు : 99124 40783, 96660 13544

గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

చౌటుప్పల్‌లో సమస్యలన్నీ పరిష్కరిస్తాం

- ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి



పెద్దకొండూర్‌లో డ్రెయినేజీ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

చౌటుప్పల్ : ఈ ప్రాంతంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండల పరిధిలోని జైకేసారం, ఎస్.లింగోటం, నేలపట్ల, కుంట్లగూడెం, మందోళ్లగూడెం, పెద్దకొండూర్, మసీదుగూడెం, చిన్నకొండూర్, దామెర, చింతలగూడెం గ్రామాల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆశీస్సులతో భారీగా నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తామన్నారు. మూడున్నరేళ్లుగా నిలిచిపోయిన అభివృద్ధిని తిరిగి పునః ప్రారంభిస్తామన్నారు. ఈ ప్రాంత ప్రజలు తీసుకున్న మంచి నిర్ణయంతో అభివృద్ధికి బాటలు పడ్డాయని తెలిపారు. గ్రామాల వారీగా ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా ముందు సాగుతున్నామని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా ఉంచుతానన్నారు. ఆయా కార్యక్రమాల్లో సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ చెన్నగోని అంజయ్య, సర్పంచ్‌లు కొర్పూరి సైదులు, ఆకుల సునిత, చౌట వేణుగోపాల్, బూర్గు చంద్రకళ, కాయితి రమేష్‌గౌడ్, వాకిటి భూలక్ష్మమ్మ, బక్క స్వప్న, నారెడ్డి అండాలు, ఆవుల రేణుక, ఎంపీటీసీలు తడక పారిజాత, చెన్నబోయిన వెంకటేష్, బద్దం కొండల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పురుగుల మందు తాగి ఇద్దరి ఆత్మహత్య

- ఆర్థిక ఇబ్బందులే కారణం
- చిట్యాల మండలం వెలిమినేడు శివారులో ఘటన

చిట్యాల : ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. చిట్యాల మండల పరిధిలో శుక్రవారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. చిట్యాల మండలం పిట్టంపల్లి గ్రామానికి చెందిన పసునూరి వెంకటేశ్వర్లు(55)కు వివాహం కాగా భార్యతో పాటు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయినప్పటికీ వెంకటేశ్వర్లు నార్కట్‌పల్లి మండలానికి చెందిన తన చినమామ కూతురు వరుసకు మరదలైన, ఇద్దరు కుమారులున్న ధనలక్ష్మి(45)ని తీసుకుని 18 ఏళ్ల క్రితం హైదరాబాద్‌కు వెళ్లాడు. అక్కడే హస్తినాపురంలో కిరాణ దుకాణం నడుపుకుంటూ ధనలక్ష్మి ఆమె ఇద్దరు కుమారులతో కలిసి సహజీవనం చేస్తున్నాడు.

అప్పులు అధికమై..

అయితే, వెంకటేశ్వర్లుకు ఇటీవల కాలంలో అప్పులు అధికం కావడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. వాటిని తీర్చే మార్గం కనిపించక సహజీవనం చేస్తున్న ధనలక్ష్మితో కలిసి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలోనే గురువారం సాయంత్రం ఇద్దరు కుమారులను అక్కడే ఉంచి ధనలక్ష్మి, వెంకటేశ్వర్లు చిట్యాల మండలం వెలిమినేడు శివారులోని రసాయన పరిశ్రమ సమీపంలోని కొంటుగుట్టల్లోకి చేరుకున్నారు. అనంతరం తమ వెంట తెచ్చుకున్న పురుగుల మందును కూల్ డ్రింక్స్‌లో కలుపుకుని ఇద్దరు తాగారు. అయితే, తాము ఆత్మహత్య చేసుకుంటున్నామని, వెలిమినేడు శివారులోని గుట్టల్లో ఉన్నట్లు ధనలక్ష్మి తమ బంధువులకు ఫోన్‌లో అదే రోజు సాయంత్రం సమాచారం ఇచ్చింది.

అర్ధరాత్రి వరకు వెతికినా..

ధనలక్ష్మి ఫోన్‌లో ఇచ్చిన సమాచారం మేరకు ఆమె బంధువులతో పాటు పోలీసులు వెలిమినేడు శివారులోని గుట్టల్లో గురువారం అర్ధరాత్రి వరకు వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం ఉదయం మరోమారు వెతకడంతో వారు గ్రామ శివారులోని కొంటుగుట్టపై ధనలక్ష్మితో పాటు వెంకటేశ్వర్లు విగతజీవులుగా కనిపించారు. దీంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కాగా, తాము అప్పుల బాధతోనే అఘాయిత్యానికి ఒడిగట్టినట్లు మృతుల వద్ద లభించిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇద్దరి మృతదేహాలకు నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి వారి వారి కుటుంబ సభ్యులు, బంధువులకు అప్పగించారు. మృతుడు వెంకటేశ్వర్లు మొదటి భార్య కుమారుడు అవినాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిట్యాల పోలీసులు తెలిపారు.



ఘటనా స్థలంలో వెంకటేశ్వర్లు, ధనలక్ష్మి మృతదేహాలు


దామెరలో ఉరేసుకుని యువకుడు..



హరీష్ మృతదేహం

చౌటుప్పల్ : మండల పరిధిలోని దామెర గ్రామంలో శుక్రవారం యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఊడుగు లక్ష్మణ్‌దాస్‌గౌడ్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతనికి కుమార్తెతో పాటు కుమారుడు ఊడుగు హరీష్‌గౌడ్(19) ఉన్నారు. కుమారుడు డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల హరీష్ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. అందులో భాగంగా పదిహేను రోజులుగా ఇంటి వద్దే ఉన్నప్పటికీ తల్లిదండ్రులతో మాట్లాడకుండా దిగాలుగా ఉన్నాడు. ఏం జరిగిందని అడిగినా ఎలాంటి సమాధానం చెప్పలేదు. ఆ క్రమంలో శుక్రవారం ఉదయం 8గంటల ప్రాంతంలో ఆటో కిరాయికి వెళ్లిన తండ్రి గంట సేపటి తర్వాత తిరిగి వచ్చాడు. అనంతరం ఇంట్లోకి వెళ్లగా కుమారుడు పూజ గదిలో దూలానికి చీరతో ఉరివేసుకొని వేలాడుతూ కన్పించాడు. పరిశీలించగా అప్పటికే చనిపోయాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అనిల్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి బలవన్మరణం



రాజుగౌడ్ (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి : ఆర్థిక ఇబ్బందులతో గీత కార్మికుడు చెట్టుకు ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు.ఈ ఘటన మండలంలోని పిలాయిపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బత్తుల రాజుగౌడ్(35) కులవృత్తిపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నాడు. రోజుమాదిరిగానే గురువారం సాయంత్రం కల్లు గీసేందుకని స్నేహితుడి బైక్ తీసుకొని ఇంటి నుంచి బయలుదేరాడు. అనంతరం రాత్రి 6.30 గంటల సమయంలో తండ్రి ముత్యాలుతో పాటు కూతురు కావ్యకు ఫోన్ చేసి అప్పులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నానని, తనకు జీవితంపై విరక్తి చెంది చనిపోతున్నానని తెలిపాడు. అనంతరం ఫోన్‌స్విచాఫ్ చేశాడు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు రాజు కోసం రాత్రంతా చుట్టుపక్కల, తెలిసిన చోటల్లా వెదికినా ఆచూకీ లభించలేదు.

దేశ్‌ముఖి శివారులో చెట్టుకు ఉరివేసుకొని..

కాగా బత్తుల రాజు గురువారం రాత్రి దేశ్‌ముఖి శివారులోని మోడల్‌హిల్స్ వెంచర్‌లోని వేపచెట్టుకు నైలాన్ తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకొన్నాడు. శుక్రవారం దేశ్‌ముఖి గ్రామానికి చెందిన దాసర్ల శ్రీశైలం అటుగా వెళ్లగా చెట్టుకు వేలాడుతున్న మృతదేహాన్ని చూసి భయపడి, విషయం గ్రామస్తులకు, ఇటు పోలీసులకు తెలిపారు. అనంతరం పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కిందికి దించి పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టమ్ నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతుడి సోదరుడు జంగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదిరెడ్డి తెలిపారు.

పెద్దగట్టు ముస్తాబు

రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద జాతరగా పేరొందిన పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతర ఏర్పాట్లు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఫిబ్రవరి 5 నుంచి 9 వరకు జాతర జరగనుండడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మౌలిక వసతులు కల్పిస్తున్నారు. అదేవిధంగా ఆలయానికి రంగులు ఇతర సుందరీకరణ పనులు చేస్తున్నారు.

– సాక్షి, స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, సూర్యాపేట



పెద్దగట్టు ఆలయానికి వెళ్లే దారిలో సింహద్వారం



పెద్దగట్టుపైన వేస్తున్న పందిళ్లు



ఆలయానికి వెళ్లే దారిలో విద్యుత్ బల్బులు అమర్చుతున్న సిబ్బంది





ఆలయానికి రంగులు వేస్తున్న కూలీలు, నిర్మిస్తున్న మంచినీటి ట్యాంక్

ప్రాణం తీసిన కుటుంబ కలహాలు

- హుస్సేన్‌బాద్ వాసి హైదరాబాద్‌లో బలవన్మరణం
- భవనం పైనుంచి దూకి అఘాయిత్యం
- స్వగ్రామంలో విషాదఛాయలు



నవ్య(ఫైల్)

మోతె : కుటుంబ కలహాలు ఓ వివాహిత ప్రాణం తీశాయి. మోతె మండలం హుస్సేన్‌బాద్ వాసి హైదరాబాద్‌లో భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకోగా స్వగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. హుస్సేన్‌బాద్ గ్రామానికి చెందిన బైరపంగు నవ్య (25) ఇదే గ్రామానికి చెందిన కిరణ్ ఎనిమదేళ్ల క్రితం ప్రేమించుకుని పెద్దల అంగీకారంతో వివాహం చేసుకున్నారు. వీరికి ఆరేళ్ల కుమారుడు, రెండేళ్ల కుమార్తె ఉన్నారు. కొంతకాలం క్రితం హైదరాబాద్‌కు వెళ్లి అక్కడే కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల నూతనంగా నిర్మిస్తున్న ఓ భవంతికి వాచ్‌మెన్లుగా ఉంటూ అక్కడే నివసిస్తున్నారు. అయితే, సాఫీగా సాగుతున్న వీరి కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతోంది. ఈ క్రమంలోనే దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. గురువారం రాత్రి ఇద్దరి మధ్య గొడవ జరగడంతో నవ్య తీవ్ర మనస్తాపం చెందింది. ఈ నేపథ్యంలోనే నవ్య శుక్రవారం తెల్లవారుజామున తాము నివసిస్తున్న భవంతి పైనుంచి దూకి అఘాయిత్యానికి ఒడిగట్టింది. తీవ్రంగా గాయపడిన ఆమెను సమీప ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

మిన్నంటిన రోదనలు

కాగా, ఆత్మహత్య చేసుకున్న నవ్య మృతదేహానికి హైదరాబాద్‌లోనే పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం స్వగ్రామం హుస్సేన్‌బాద్‌కు తీసుకొచ్చారు. అల్లారుముద్దుగా పెంచుకున్న కూతురు కళ్లెదుటే విగతజీవిగా కనిపించడంతో నవ్య తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. తల్లిని కోల్పోయిన చిన్నారులను హత్తుకుని గుండెలవిసేలా రోదించారు.

వరిలో తెగుళ్ల ఉధృతి.. నివారణ చర్యలు

- కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ భరత్ సూచనలు



త్రిపురారం : ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సాగవుతున్న వరి పంటలకు చీడపీడల ఉధృతి అధికంగా ఉంది. దీని నివారణకు తప్పనిసరిగా సంరక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ప్రస్తుతం వరి పంటలో శాస్త్రవేత్తలు గుర్తించిన చీడపీడలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు కేవీకే కంపాసాగర్ సేద్యపు విభాగం శాస్త్రవేత్త డాక్టర్ భరత్ మాటల్లో..

కాండం తొలుచు పురుగు నివారణకు..

వరి పంటలో కాండం తొలుచు పురుగు ఉధృతి అధికంగా ఉన్నందున నివారణకు 2 గ్రాముల కార్టఫ్ హైడ్రోక్లోరైడ్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. లేదా 10 కిలోల కార్టఫ్ హైడ్రోక్లోరైడ్ 4జి గులికలు లేదా 10 కిలోల కార్బోఫ్యూరాన్ 3జి లేదా 4 కిలోల క్లోరాంట్రానిలిప్రోల్ గులికలు ఎకరం పొలానికి వేసుకోవాలి.



త్రిపురారంలో అగ్గితెగులు సోకిన వరి పైరు

పాడి పంట

వరి ఆకులు ఎండిపోతుంటే..

వరి పంటలో ఆకులు ఎండిపోతూ, పంట గిడసబారి అగ్గి తెగులును గుర్తించిన వెంటనే నివారణకు 0.6 గ్రాముల ట్రైసైక్లోజోల్ లేదా 1.5 మి.లీ ఐసోప్రోథమోలిన్ లేదా 2.5 మి.లీగాను మైసిన్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

ఉల్లికోడు పురుగు నివారణకు..

వరి పంటలో ఉల్లికోడు పురుగు ఉధృతిని గమనించిన వెంటనే నివారణకు 2 మి.లీ కార్బోసల్ఫాన్ లేదా పిప్రోనిల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. లేదా 10 కిలోల కార్బోఫ్యూరాన్ 3జీ లేదా 4 కిలోల పిఫ్రోనిల్ 0.6 జి గులికలను ఎకరానికి వేసుకోవాలి.

కాలిబాటలు తప్పనిసరి

వేసవి కాలంలో పొలం నాటిన తర్వాత ఉత్తరం – దక్షిణం ఉండే విధంగా ప్రతి రెండు మీటర్లకు 30 సెంటీమీటర్లు ఉండేటట్లు తప్పనిసరిగా కాలిబాటలు తీసుకోవాలి. దీంతో వరి పైరుకు గాలి, వెలుతురు బాగా సోకి చీడపీడల ఉధృతి తగ్గుతుంది. కాలి బాటల్లో నడుచుకుంటూ ఎరువులు చల్లుకోవడం, పురుగు మందులు పిచికారీ చేసుకోవచ్చు. అదేవిధంగా చలి ఉధృతి ఎక్కువగా ఉండడంతో వరి పంట వేర్లు కుళ్లిపోయి వాసన రావడం జరుగుతుంది. రైతులు సకాలంలో పంటను గమనించి నివారణకు వెంట్రుక మందం తేమ ఉండేవిధంగా ఎండగట్టాలి. అదేవిధంగా కార్బండిజమ్ ఒక గ్రాము లేదా ప్రోపకోనాజోల్ 1 మి.లీ లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేసుకోవాలి.